10 నుంచి గాంధర్వం–2 జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో గాంధర్వం–2 శీర్షికన జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి తెలిపారు. మాసాబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గాంధర్వం–2 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్రీయ సంగీత, నృత్య రీతుల ఔన్నత్యం, గొప్పదనాన్ని యువ తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన 60 మంది రీసెర్చ్ స్కాలర్స్ ఈ గాంధర్వం–2 సదస్సులో తమ పరిశోధనాత్మక పత్రాలు సమర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమ సమన్వయకర్త, నృత్య గురువు నిష్టల సుధామాల హైదరాబాద్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభలో జరిగే సదస్సు వివరాలను తెలియజేశారు. సెమినార్ ఇన్‌చార్జి డాక్టర్ ఇందిరా హేమ, కో చైర్మన్ రజిత్ ఆకుల, టీటీడీ డీఈఓ డాక్టర్ నండూరి విద్యారణ్యస్వామి నవ్య నాటక సమితి అధ్యక్షుడు వి. విజయ్‌కుమార్, కార్యదర్శి ఆర్.ఎన్.సుధారాణి పాల్గొన్నారు.

2 కిలోమీటర్లు.. 35 నిమిషాలు!



గోల్కొండ బంజారా దర్వాజ నిలిచిన వాహనాలు

- రద్దీగా టోలిచౌకీ, రేతిబౌలి, గోల్కొండ బంజారా దర్వాజ
- వేలాది వాహనాలతో నిత్యం ట్రాఫిక్ జామ్
- రోడ్లకిరువైపులా ఇష్టారాజ్యంగా పార్కింగ్
- విద్యార్థులు, ఉద్యోగుల తీవ్ర ఇబ్బందులు

గోల్కొండ: టోలిచౌకీ, రేతిబౌలి, గోల్కొండ బంజారా దర్వాజ తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీక్ అవర్స్‌లో 2 కిలోమీటర్ల దూరానికి కనీసం 35 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే ఉంటున్నామని వారు వాపోతున్నారు. టోలిచౌకీ చౌరస్తా నుంచి రేతిబౌలి చౌరస్తా వరకు సాయంత్రం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు పెద్ద సంఖ్యలో వాహనాలు బారులుతీరి ఉంటున్నాయి. అదేవిధంగా బంజారి దర్వాజా వద్ద ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోతున్నాయి. లంగర్‌హౌజ్ నుంచి ఫతేదర్వాజా మీదుగా గోల్కొండ వెళ్లాలంటే కూడా వాహనాదారులు ట్రాఫిక్‌ను చూసి భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకొని సతమతమవుతున్నారు. మరోవైపు టోలిచౌకీ చౌరస్తా కూడా ట్రాఫిక్ నిలుస్తున్నది. మరోవైపు గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే మార్గంలో టోలిచౌకీ చౌరస్తా వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు తవ్వకాలు చేసి వదిలేశారు. దీంతో గత్యంతరం లేక వాహనదారులు రుమాన్ హోటల్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్..

చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ జాంకు అక్రమ పార్కింగ్‌లు ప్రధాన కారణమవుతున్నాయి. ప్రధానంగా షేక్‌పేట్ డీమార్ట్, గెలాక్సీ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ద్విచక్ర వాహనాలు, కార్లు గంటల తరబడి పార్కు చేసి ఉంటున్నాయి. టోలిచౌకీ చౌరస్తా వద్ద రుమాన్ హోటల్, రహమత్ హోటల్స్ ఎదుట రెండు వైపులా ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో నిలుపుతున్నారు. అదేవిధంగా గోల్కొండ బంజారా దర్వాజ వద్ద సైతం అక్రమ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ సిబ్బంది స్పందించి వాహనాలు సాఫీగా వెళ్లేలా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: డివిజన్‌లోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్–2లో సివరేజ్ పైపులైన్ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల డివిజన్‌లో పర్యటించినప్పుడు ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురాగా జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ.7.30 లక్షల నిధులు మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు ఆర్.నరసింహ గౌడ్, జమాల్‌పూర్ అశోక్, హనుమంత్, భాను ప్రకాశ్, శివచంద్రగిరి, అనిత, ఆశీష్ దూబే, దుర్గాదాస్, బస్తీవాసులు, మహిళలు, బీజేపీ నాయకులు జే చంద్రశేఖర్, ఈ సుమన్ కుమార్ ముదిరాజ్, జీ రఘుకాంత్, కొడి సురేందర్, ప్రేమాజ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బస్తీవాసులు

గోల్కొండ: కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ను మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయంలో సత్యనారాయణనగర్, హీరానగర్ బస్తీలవాసులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తుండడంతో ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడంతో పాటు పార్కులను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత కాలనీ వాసులదేనని అన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రతినిధులు

తల్లిపాల వారోత్సవాలు



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ యశోద

నాంపల్లి: చింతలబస్తీ వీర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం సూపర్‌వైజర్ రమ్య పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్ యశోద చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించాలన్నారు. అలాగే బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదకరం



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ

గోల్కొండ: రాంగ్‌రూట్ ప్రమాదకరమని ట్రాఫిక్–3 డీసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. పిల్లర్ నంబర్ 63 వద్ద గల రూప్ గార్డెన్ ఫంక్షన్‌హాల్ వద్ద బుధవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూ టర్న్ తీసుకోకుండా చాలామంది షార్ట్ కట్‌లో రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న 250 ద్విచక్ర వాహనాలు, ఆటోల నంబర్ ప్లేట్లు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. 'రాంగ్‌రూట్ వద్దు–రైట్ డ్రైవ్ ముద్దు' అనే నినాదాన్ని వాహనదారులు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ ధనలక్ష్మి, లంగర్‌హౌస్, టోలిచౌకీ, గోషామహల్ ఇన్‌స్పెక్టర్లు పి.అంజయ్య, సుధాకర్, బాలాజీ పాల్గొన్నారు.

గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తమ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా పురానాపూల్, సిద్దిఅంబర్‌బజార్, ఎంజే బ్రిడ్జి, గోషామహల్ తదితర ప్రాంతాల్లో రాంగ్‌రూట్ వెళ్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారుల భద్రత, వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే స్పెషల్ డ్రైవ్ చేపట్టామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

33 మంది వాహనదారులపై కేసు

సంతోష్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన 33 మంది వాహనదారులపై కేసు నమోదు చేశామని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా నాయక్ తెలిపారు. ధోబిఘాట్ చౌరస్తా, ఆర్టీసీ కాలనీల వద్ద బుధవారం ఎస్ఐలు, సిబ్బందితో కలిసి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రాఫిక్ ఉల్లంఘించిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ చార్మినార్ యూనానీ ఆసుపత్రిలో బోనాలు



బోనాలతో యూనానీ ఆసుపత్రి ఉద్యోగులు

యాకుత్‌పురా: ప్రభుత్వ చార్మినార్ యూనానీ ఆసుపత్రిలో బుధవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామియా టిబ్బి కళాశాల, యూనానీ ఆసుపత్రుల ఉద్యోగులు, శివసత్తుల నృత్యాల నడుమ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేసిఇ బోనాలు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమానికి టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అకుల సత్యనారాయణ, ఆయూష్ డిప్యూటీ డైరెక్టర్ బీ. స్వరూపారాణి, యూనానీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జే. వసంతరావు, ఆయుర్వేద అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ కవిత, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఐపీసీఆర్ పాత్రుడు, డాక్టర్లు సబిత, జీ. వెంకటేశ్వర్లు, ఎన్. నరసింహ, లే సెక్రటరీ ముత్యాలు, డాక్టర్లు సిరాజుల్ హక్, రవి నాయక్, ప్రభాకర్, అధికారులు, నర్సులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత రాజులపల్లి ప్రతాప్ రచించిన 'జుడుగుడు' పుస్తకావిష్కరణ సభను బుధవారం రవీంద్రభారతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య టి.కిషన్‌రావు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినప్పటికీ తెలుగు సాహిత్యంపై చక్కటి పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కె.పద్మ, విశ్రాంత ప్రొఫెసర్ కట్ట నర్సింహరెడ్డి, ముంబాయి ఆంధ్రా మహాసభ సాహిత్య విభాగం ఉపాధ్యక్షుడు ఎస్.రవీంద్ర, సమ్మెట నాగమల్లేశ్వరరావు, గజ్జల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

17 నుంచి తీగలకుంటలో ఉర్సు

బహదూర్‌పురా: ఈ నెల 17, 18, 19 తేదీల్లో తీగలకుంటలోని యూసుఫియాలో హజ్రత్ అల్లామ సయ్యదినా సూఫీ యూసుఫ్ అలీ అల్ మారూఫ్ దాదాగౌబ్ ఖలందర్ ఖిబ్లా (రహ్మ) ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17న అస్ర్ నమాజ్ తర్వాత తీసుకువస్తారని, అనంతరం సంథల్ ఊరేగింపు ఉంటుందని, తాడ్‌బన్ ఖాజా పహాడి నుంచి బయలుదేరి తీగలకుంటకు చేరుకుంటుందన్నారు. 18న చిరాగ, 19న మహఫిలె సిమా కార్యక్రమాలు ఉంటాయన్నారు. హజ్రత్ సూఫీ ఆజమ్ అధ్యక్షతన వహిస్తారు. సయ్యద్ షా మహమూద్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమం మౌలానా సూఫీ అతహర్ అలీ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని పేర్కొ న్నారు. వివరాలకు 93920 98452 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అధికారుల సహకారంతోనే బోనాలు విజయవంతం

గోల్కొండ: రాష్ట్ర దేవాదాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారుల సహకారంతోనే గోల్కొండ కోట శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల బోనాల ఉత్సవాలు విజయవంతం అయ్యాయని అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోనాల సందర్భంగా వృత్తిపని వారు ఎంతో అంకితభావంతో సేవ చేస్తారని, వారికి దేవాదాయ శాఖ గుర్తింపు కార్డులతో పాటు గౌరవ వేతనం ఇస్తున్నదని తెలిపారు.

రెండు రోజుల జైలు



మహ్మద్ ఫతే అలీ

సంతోష్‌నగర్: తల్లిని దుర్భాలాడుతున్న ఓ వ్యక్తిని నాంపల్లిలోని ఏడో మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా జడ్జి 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి, ఎస్ఐ లింగరాజులు తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫతే అలీ (40) తన తల్లి జహంగీర్ బీతో నిత్యం గొడవ పడుతూ బహిరంగ ప్రదేశాల్లో అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మహ్మద్ ఫతే అలీని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

నిబంధనలు పాటించిన వ్యాపారికి జైలు

సంతోష్‌నగర్: నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి దాటినా కూడా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారిని బుధవారం సంతోష్‌నగర్ పోలీసులు నాంపల్లిలోని ఏడో మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ పి.రఘువీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రియాసత్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్రం (34) స్థానికంగా యా సయీద్ పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా పోలీసుల నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు నిర్వహిస్తున్నాడు. దీనిపై పోలీసులు అక్రంపై ఈ–పెట్టి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి బుధవారం నాంపల్లిలోని ఏడో మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మహిళా యూనివర్సిటీని ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- విశ్వవిద్యాలయంలో మాక్ పార్లమెంట్‌కు హాజరు



సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి నిధులు వచ్చేలా చేసి ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బ్రిటిష్ రెసిడెన్షియల్ యూత్ పార్లమెంట్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించి పార్లమెంట్‌లో జరిగే ప్రతి సన్నివేశాన్ని కండ్లకు కట్టినట్లు చూపించారు. స్పీకర్‌గా పిఫాని అనే విద్యార్థి ఉండగా, సభాపక్ష నేతలుగా కొంతమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా విశ్వవిద్యాలయంలో 6 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించడం గొప్ప విషయమన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఈ విశ్వవిద్యాలయంపై బిల్లు పెట్టేలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ పాండురంగారెడ్డి, మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజ్జులత, స్పెషల్ ఆఫీసర్ సరస్వతమ్మ, పొలిటికల్ సైన్స్ హెచ్ఓడీ డాక్టర్ కేబీ రత్నకుమారి, ప్రొఫెసర్ కృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



వరల్డ్ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ క్విజ్‌తో తల్లులకు ఉపయోగం



గోల్కొండ: వరల్డ్ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ క్విజ్ కార్యక్రమం తల్లులకు ఎంతో ఉపయోగపడుతుందని ఫెర్నాండెస్ ఆసుపత్రి నియోనాటాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ తేజోప్రతాప్ ఓలేటి అన్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని హోటల్ గోల్కొండలో నేషనల్ నియోనాటాలజీ ఫోరం తెలంగాణ స్టేట్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ ట్విన్ సిటీస్ చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం వరల్డ్ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్ విల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు పట్టడంపై అవగాహన, ప్రాధాన్యతను పెంచుకోవడానికి క్విజ్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ ఇంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకత, అపోహలు తొలగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్ఎన్ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ యాదయ్య మాట్లాడుతూ తల్లి పాలు పట్టడంతో రాష్రటం దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఐఏపీఐవైసీఎఫ్ డాక్టర్ శ్రీకృష్ణ, ఐఏపీటీసీబీ అధ్యక్షుడు డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, జాతీయ ఐఏపీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ హిమబిందుసింగ్ తదితరులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆసిఫ్ నగర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తేజ అన్నారు. ఆసిఫ్‌నగర్‌లోని నారాయణ ఒలంపియార్డ్ స్కూల్‌లో విద్యార్థి నేతలుగా ఎన్నికైనవారికి ఇన్వెస్టిట్యూర్ సెర్మనిని బుధవారం నిర్వహించారు. హెడ్, డిప్యూటీ బాయ్స్‌గా అబ్దుల్ ఘనీ మహ్మద్ హాదీ, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ గర్ల్స్‌గా హీరాం ఫాతీమా, సంధ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు బ్యాడ్జీలు ధరించి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ నవీన్ కుమార్, ప్రిన్సిపాల్ ఫర్హానా ముబీన్, కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, ఫర్హానా, రష్మికా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

చార్మినార్: 'స్వచ్ఛదనం, పచ్చదనం' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్, స్వచ్ఛ దనం, పచ్చదనం కార్యక్రమం ప్రత్యేకాధికారి దేవసేనా సూచించారు. చార్మినార్ సర్కిల్ పరిధిలోని దారుషిఫా చౌరస్తాలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న, పత్తర్ గట్టి కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీతో కలిసి దారుషిఫా ప్రధాన కూడలిలో మొక్కలు నాటారు. అలాగే దోమల నివారణపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణ, నాలాల పూడికతీత, పరిసరాల శుభ్రత, దోమల నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, మలేరియా సీనియర్ ఎంటామాలజిస్ట్ నామల శ్రీనివాస్, యూసీడీ డీపీఓ యుగంధర్ రెడ్డి, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కవితల పోటీలకు ఆహ్వానం



అబిడ్స్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్వాల బాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నవభారత్ నిర్మాణ్ సంఘ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్మాణ్ సంఘ్ అధ్యక్షుడు, విద్యావేత్త డాక్టర్ సూరెపల్లి రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంపే కవితలు 20 నుంచి 25 లైన్లు మాత్రమే ఉండాలని ఈ నెల 20 వరకు పంపించాలని కోరారు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే ఉంటుందని పేర్కొన్నారు. పంపిన కవితలను జాతీయస్థాయి సాహిత్య నిపుణుల పర్యవేక్షణలో పరిశీలించి మూడు ఉత్తమ కవితలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.2116, ద్వితీయ, రూ.1616, తృతీయ బహుమతి 1016, ప్రోత్సాహక బహుమతులు రూ.516 ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 63037 32862 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ పనుల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈ నెల 8న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మెహిదీపట్నం సీబీడీసీ–7 అధికారి వంశీమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నాంపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 వరకు నాంపల్లి ఏరియాసుపత్రి, తేకడి మసీదు, అబీబ్‌నగర్, అబ్జల్‌సాగర్ బజార్‌ఘట్, నాంపల్లి ఆసుపత్రి తదితర ప్రాంతాలు. అదేవిధంగా నాంపల్లి సబ్‌స్టేషన్ రెడ్‌హిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లక్డీకాపూల్, ఫ్యాప్సీ, బజార్‌ఘట్, ప్రగతి ప్రింటింగ్ ప్రెస్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 1 గంట వరకు. ఆసిఫ్‌నగర్ సబ్‌స్టేషన్ మెహిదీపట్నం కేబుల్ పరిధిలోని దిల్ కాలనీ, బీబీ కాలనీ, దిల్షాద్‌నగర్, ఎంఐజీహెచ్, క్రాంతినగర్, అంబా టాకీస్, ఐటీ కాలనీ, రాంమూర్తి కాలనీ, మెహిదీపట్నం బస్‌డిపో తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చిన్నారులకు తల్లిపాలు తప్పనిసరి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: అనేక పోషకాలు గల తల్లీపాలను బాలింతలు పిల్లలకు తప్పకుండా పట్టించాలని తలాబ్‌చంచలం కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగం సూచించారు. ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తలాబ్‌కట్టా అమన్ నగర్–బీలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు అధిక ప్రోటీన్లు గల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ పావనీ, అమన్‌నగర్ సెక్టార్ సూపర్‌వైజర్ సావిత్రీ, అంగన్‌వాడీ టీచర్లు సుదర్శనమ్మ, జకీయా, కమర్ జాహ పాల్గొన్నారు.

9న బాధ్యతల స్వీకరణ

యాకుత్‌పురా: ప్రభుత్వ రంగా సెట్విన్ శిక్షణ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎన్. గిరిధర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కే. వేణుగోపాల్ రావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజానరసింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు హాజరు కానున్నారని తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి



చేనేత షోరూంను సందర్శిస్తున్న గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ పేర్కొన్నారు. జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా అబిడ్స్ కట్టెలమండీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన హైండ్‌లూమ్ టెక్స్‌టైల్ షోరూంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ నాయకులతో పాటు ఇతరులు కూడా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి కులస్తుల ఆర్థికాభివృద్ధికి దోహద పడాలన్నారు. కార్యక్రమంలో జయశ్రీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతకు పూజలు



పూజలు చేస్తున్న పీఠాధిపతి హౌగేలింగేశ్వర మహారాజ్

జియాగూడ: జియాగూడలోని శ్రీ ఇష్ట లింగేశ్వర సంస్థాన్ మఠంలో శ్రావణమాస వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం బీదర్ మైలార్ మల్లన్న దేవస్థానానికి చెందిన పీఠాధిపతి శ్రీ హౌగేలింగేశ్వర మహారాజ్ హాజరై నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మఠంలో ప్రతిరోజు రుద్రాభిషేకం ఆరు రోజుల పాటు నిర్వహించడం, ప్రవచనం, కీర్తనలు, సాయంత్రం అన్నదానాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మఠం ప్రతినిధులు రఘునాథ్ సుర్యవంశీ, రాజ్‌కుమార్ బిరాదర్, ఎస్.బాబురావు, కే శ్రీకాంత్, సంజయ్, ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడిన ఐదుగురి అరెస్టు

జియాగూడ: పురానాపూల్ జాతీయ రహదారిలో దారికాచి దోపిడీకి పాల్పడిన ఓ రౌడీషీటర్, మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి సెల్‌ఫోన్, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి తెలిపారు. బుధవారం గ్రేటర్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర, సౌత్‌వెస్ట్ డీసీపీ జీ చంద్రమోహన్ ఆదేశాల మేరకు దాడి చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 4న స్విగ్గీ డెలివరీ చేసే ఓ యువకుడు నారాయణగూడలోని ఇండియన్ దర్బార్ నుంచి అత్తాపూర్‌కు స్నేహితుడి బైక్‌పై పురానాపూల్ దిగువలోని 100 ఫీట్ల జాతీయ రహదారిలో వెళ్తుండగా పీలీ మండప్ ప్రాంతంలో పురానాపూల్ పార్థీవాడకు చెందిన రౌడీషీటర్ చౌకత్ ఆకాశ్ (20) వృత్తిరీత్యా బావర్చి ఇతను కామటిపురా రౌడీషీటర్, పాతబస్తీ గౌలిపురాకు చెందిన పి.విశాల్‌సింగ్ (21) వృత్తిరీత్యా ఫ్లిప్‌కార్ట్, పాతబస్తీ ఆర్యసమాజ్ ప్రాంతానికి చెందిన బిరాదర్ కిషన్‌రావు రోహిత్ (25) వృత్తిరీత్యా పార్టీ ఈవెంట్స్ డెకరేటర్. సీతాఫల్ మండి ప్రాంతానికి చెందిన ఎస్.జితేందర్ (19) వృత్తిరీత్యా కూలి, లంగర్‌హౌస్‌కు చెందిన జి.ప్రదీప్ (20) వృత్తిరీత్యా విద్యార్థి. వీరు స్విగ్గీ ఆర్డర్‌పై వెళ్తున్న ఇద్దరిని ఆపి కత్తితో బెదిరించి ఫోన్ లాక్కొని పరారయ్యారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరిని గురువారం అదుపులోకి తీసుకుని కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.